# హీరో రాముడూ, పోటు రాముడూ

నాకు ట్రాన్స్‌ఫర్ అవటం వల్ల తాడేపల్లి గూడెం నించి రాజమండ్రికి వారానికి రెండు మూడు సార్లు రాకా పోకా రైలు ప్రయాణం తప్పనిసరయింది. ఇందుకు నాకనువైన బండి తిరుమల ఎక్స్‌ప్రెస్. అదే ఇప్పుడీకథగాని కథకి ముడిసరుకు.

★ ★ ★

ఆ ఉదయం గూడెంలో బండి ఎక్కాను. ఎక్కేముందు ఒకటికి రెండుసార్లు కాఫీ తాగానేమో బండి బయల్దేరి నిడదవోలు చేరేలోపలే నేను 'చిన్న పని'కి లెట్రిన్‌కెళ్లాల్సొచ్చింది. అక్కడ పని కానిచ్చుకొని తిరిగి రాబోతూండగా చటుక్కున నా కళ్లబడింది అక్కడ వాష్ బేసిన్ ఎగువగా తెల్లని మైకా గోడమీద రాసున్న రాత :

'కొవ్వూరు కోటిలక్ష్మికి క్వాలిటీ ఐస్‌క్రీమ్ కొనిచ్చాను. ముద్దు పెట్టుకోనిచ్చింది. ఎంత బాగుందో! - ఇట్లు హీరో రాముడు'

ఈ రాతకింద రెండు ఆడా మగా మొహాలు ముద్దుపెట్టుకుంటున్న బొమ్మొంది. రాతా స్వచ్ఛంగా ఉంది. బొమ్మా అందంగా ఉంది. కనుక, ఈ పని, ఇల్లాంటి పిచ్చి రాతల్లో చెయ్యి తిరిగిన ఆర్టిస్టు లెవరిదో అయ్యుంటుందనిపించింది నాకు. చెరిపేద్దామనుకున్నాను కానీ, ఎందుకో చెరపబుద్ధి కాలేదు. బుద్ధిగా ఇవతలకొచ్చేశాను.

నాలుగు రోజుల తర్వాత ఓ ఉదయం మళ్లీ అదే తిరుమల ఎక్స్‌ప్రెస్ ఎక్కాను. అయితే అదే పెట్టె ఎక్కాననే విషయం లెట్రిన్‌లోకెడితేనే గాని తెలీలేదు. లెట్రిన్‌లో క్రితంసారి నేను చూసిన రాత అట్లాగే ఉండగా, దానికింద కొత్త రాతొకటి ప్రత్యక్షమైంది.

'కొయ్యరా కొయ్! ఐస్‌క్రీముకే ముద్దుపెట్టుకోనిచ్చే రోజులు నా చిన్నప్పుడే పోయాయిరా నాన్నా. అసలు నేను చూడు అయిదు పైసలు కూడా ఇయ్యకుండానే పదిహేనేళ్ల పశివేదల ప్రసాదమ్మను అయిదుసార్లు ముద్దు పెట్టుకున్నాను. (ఇక్కడ 'ముద్దు పెట్టుకున్నాను' అని కాకుండా రాయకూడని అశ్లీలపు మాట ఇంకేదో రాసుంది). నేను ముద్దు పెట్టుకున్నప్పుడల్లా (అశ్లీలం) తెగ సుఖపడిపోతుంది. అందుకే నేనంటే అది చెవి కోసుకుంటుంది ఇట్లు - పోటు రాముడు' నాకు వెంటనే వచ్చిన రియాక్షన్ - చిరాకు!

'కాకినాడ నించి తిరపతి దాకా, మళ్లీ వెనక్కి తిరపతి నించి కాకినాడ దాకా ఈ పిచ్చి రాతలు ఎంతమంది ఆడా మగా కంటబడుతున్నాయో, ఎంత మందికి ఎన్ని రకాల అనవసర, ప్రమాదకర ఆలోచన్లు కలిగిస్తున్నాయో గదా!' అనిపించింది. నా కింకా ఆలోచన్లొచ్చాయి. 'ఈ రాతగాళ్లిద్దరూ లేత వయస్సు కుర్రాళ్ళు. బహుశా నిడదవోలు నించో కొవ్వూరునించో రోజూ రాజమండ్రికి చదువు కోసం షటిల్ చేసే స్టూడెంట్లయ్యుండొచ్చు మొదటి వాడికంటే రెండోవాడు కొంచెం ముదురు అయ్యుండొచ్చు

కూడా! ఎంత ముదురైనప్పటికీ మొదటివాడికిలాగే రెండోవాడికి కూడా ఊహ ఎక్కువ, 'అనుభవం' తక్కువ అయ్యుండాలి. ఎందుకంటే, పండిన అనుభవం కలవాడెవ్వడూ దాన్ని పిచ్చిరాతల్లో చూపించుకోడు.

సాధారణంగా యువతీ యువకులకి పాతి కేళ్లొస్తేనేగానీ శృంగారాన్ని ఒంటబట్టించుకోవటం, ఆ మాధుర్యాన్ని ఆస్వాదించటం అనేవి అనుభవంలోకి రావు. పాతికేళ్ళ లోపల కలయికల్లో ఉండేది పరస్పరాకర్షణే. కుతూహలంతో కూడిన తొందరపాటే. వట్టి శరీరధర్మమే. ఆస్వాదనం తక్కువ. ఈ దృష్ట్యా 'పోటురాముడు' రాతలో చివరి భాగం అబద్ధం! కనక ఈ ఇద్దరూ ఖచ్చితమైన కుర్రకుంకలు!

వాస్తవానికి వ్యతిరేకంగా ఇక్కడ ఈ కుర్రాళ్ళు రాసినట్లే కొందరు పెద్దలు కూడా స్వార్థం కోసం అర్థంపర్థంలేని అశాస్త్రీయమైన రాతల్ని పుస్తకాల్లో కూడా ఎక్కించి డబ్బులు చేసుకుంటున్నారు. ఆ పుస్తకాల్లో ఉండే తప్పుడు సమాచారాన్ని ఇంకా తప్పుగా తలకెక్కించుకొని యవ్వనంలో ఎదురయ్యే అలజడుల్ని తట్టుకోలేక తికమకపడి పోతున్నారు కుర్రకారు. కొండొకచో జీవితాన్ని అనుమానాల్తోనూ, నిస్సత్తువతోనూ నిర్జీవం చేసుకుంటున్నారు. ఆ తర్వాత జీవితంలో తమ భాగస్వామి క్కూడా నరకాన్నే అందిస్తున్నారు కూడా! అర్థంపర్థంలేని ఊహలు ఊహించుకొని అన్యాయంగా ఆత్మహత్య చేసుకొన్న కుర్రాళ్లని నేనెరుగుదును మరి!'

-ఇట్లా అనుకుంటూ ఆ రాతల్ని చెరపబోయాను. కానీ మళ్లీ వెనక్కి తగ్గాను. వారం తర్వాత మళ్ళీ అదే పెట్టెలోకి నేను ఎక్కటం యాదృచ్ఛికంకాక మరేమిటి? పాతరాతల కింద కొత్తరాతొకటి ప్రత్యక్షమైంది : 'అరేయ్, గోదావరి గట్టు ప్రక్కిలంక వెంకమ్మ తెలుసా? నేను ముద్దు పెట్టుకున్నప్పుడల్లా (ఇక్కడ మళ్లీ అశ్లీలపు మాట) పరవశించి కాళ్ళూ చేతులూ కూడా కొట్టుకుంటుంది. మనిషి బంగారబ్బొమ్మ. హాపీ అంటే అదిరా సన్నాసీ మూతి మీద మొలకలొచ్చిన ప్రతివాడూ పోటుగాడు అవ్వద్రోయ్. ఇట్లు హీరో రాముడు'. ఈ రాతతో బాటు ఒక ఆడా మగా కౌగిలించుకుంటున్నట్టు బొమ్మ కూడా ఒకటి గీసుంది. వీడి అబద్ధపు అనుభవానికి నాకు నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు. అప్రయత్నంగా సన్నగా నవ్వేశాను నాకు మళ్లీ ఆలోచనొచ్చాయి : 'వీళ్లిద్దరూ ఖచ్చితంగా కుర్రాళ్లే. టీనేజ్‌లో కొచ్చిన కుర్రాళ్ల తమలోంచి తన్నుకొచ్చే ఊపునూ ఊష్ణాన్నీ బయటికి కక్కటానికి చేసే ప్రయత్నమే ఈ రాతలు. విద్యార్థుల్లో ఈ రాతలెక్కువ. యూనివర్శిటీల్లాంటి చోట కూడా లెట్రిన్స్‌లో ఇలాంటి అశ్లీలపు రాతలు విరివిగా కనిపిస్తున్నాయంటే మరింకేం అనుకోవాలి?

స్టూడెంటు కుర్రాళ్లల్లోంచి తన్నుకొచ్చే ఈ వాడినీ వేడినీ నిర్మాణాత్మకంగా ఇంకో దిక్కులోకి మళ్లించే ప్రయత్నం ఎవరైనా చేస్తే ఎంత బాగుండును! అట్లాంటి విద్యా విధానం ఎప్పుడొస్తుందో గదా!'
-ఇట్లా అనుకుంటూ లెట్రిన్‌లో ఎక్కువసేపు నుంచోకుండా బయటకొచ్చేశాన్నేను. రాజమండ్రిలో బండి దిగుతూ పెట్టె నెంబరు నోట్ చేసుకున్నాను. మళ్లీ ప్రయాణం నాటికి పెట్టె తగల్లేదు. ఆ తర్వాతి ప్రయాణం నాటికి తగిలింది ఇంకేం, ఎగిరి ఎక్కేశాను. రయ్యిన లెట్రిన్‌లోకి వెళ్ళిపోయాను. చూశాను. కరెక్ట్! నేననుకొన్నట్టుగానే 'హీరో రాముడి'కి పోటు రాముడు' జవాబిచ్చాడు 'హాపీ అంటే నీకేం తెలుసురా బచ్చా! నా యిలాకాలో మనిషి ఒకర్తి వుంది. తెగ బలిసింది. ఒంటినిండా నగలు పెట్టుకొని పట్టుచీరె కట్టుకొని, మల్లెపూలు పెట్టుకొని షాపింగుకని రాజమండ్రి వొస్తుంది. అంతే, లటుక్కున నన్ను అతుక్కుపోతుంది పర్సు తీసి నోట్లు విసిరేస్తుంది. లాడ్జింగుకు వంద, పై ఖర్చుకు వంద, నాకు వంద నీకేం వుందిరా బొంద? తగ్గు తగ్గు!- (అడివి) పోటురాముడు'

ఇప్పుడింక నాకు నవ్వు రాలేదు ఒళ్లు మండింది. ఎందుకంటే అర్థంపర్థంలేని ఈ కుర్రాళ్ళ లెట్రిన్ యుద్ధం శృతిమించి రాగాన పడుతోంది. దీనివల్ల ప్రయాణీకుల మనస్సులు గాయపడొచ్చు. కనక, 'దీన్ని ఆపటం నా విధి' అనుకుంటూ ఆ రాతల్ని చెరపబోయాను. అంతలో తళుక్కున ఒకాలోచన మెరిసింది నా బాల్‌పాయింట్ పెన్ తీశాను. అ రాతల కిదనే రాద్దామంటే చోటు లేదు. పక్క గోడ మీదికి రావల్సొచ్చింది. అక్కడ రాశాను :

'హెమ్టీ భాయ్ హిక్డా గలాటా సేస్తున్నార్? హీరో రాముడూ హేమ్టీ. అడివా రాముడూ హేమ్టీ! రామ్డుకి బేగం ఒక్కటీ ఉంది తెల్సా! రామ్డు ఫూల్. ఒక్కటి బేగం సేసుకున్నాడ్! మీరు చాలా అమ్మాయిల్నీ టచ్ ఏసినార్. తో, రామ్డు పేరూ హెంద్కూ పెట్టుకున్నార్? నేను సూడూ అయిదూ, అయిదూ బేగంలూ సేసుకున్నాన్. నాదీ పేరూ పెట్కోండి. హాపీ మస్తుగుంటాది. దమ్ముంటే సేస్కోండి. లేకపోతే గోడల మీదా హేమీ రాయకండి. - పాంచ్ కీ పాషా'

తృప్తిగా నవ్వుకుంటూ బయటకొచ్చాను. నా సీట్లో కెళ్లిపోయాను. ఈ చెత్కారీ లెట్రిన్ యుద్ధంలోకి నేను కూడా ఎందుకు దిగానో తెలీదు. వచ్చీ రాని హిందీ ఎందుకు వాడానో తెలీదు. అలా మారు పేరుతో నటించాలని ఎందుకనుకున్నానో అంతకన్నా తెలీదు. క్షణికోద్వేగం తప్ప దూరం ఆలోచన ఎంతమాత్రమూ లేదు. ఈ దెబ్బతో ఈ యుద్ధం ఆగిపోతుందని మాత్రం ఆశపడ్డాను. అదే నేను చేసిన పొరపాటు! నా ఆశ తీరకపోగా, నా పని తాలూకు ఫలితం తీవ్రాతి తీవ్రమై తేలింది. ఎంతగా తేలిందంటే అసలు కథనే మలుపు తిప్పేసింది! మళ్లీసారి బండెక్కి నేను లెట్రిన్‌లో కెళ్లినప్పుడు నా రాతకి కింద రెండు రాతలు ఇలా ఉన్నాయి: 'అరేయ్ మా రాముణ్ణి ఫూల్ అంటావురా! ఎవడ్రా ఫూలు, నువ్వు ఫూలు, నీ బాబు ఫూలు, నీ తాత ఫూలు, నీ యమ్మ ఫూలు నీయమ్మమ్మ ఫూలు! నన్ను వంద అను పడతాను. రాముణ్ణి అంటే మాత్రం దుమ్ములేరేస్తాన్రోయ్ జాగర్త! రాముడు మనకి లీడర్రా ! ఇండియాకే ఆదర్శ పురుషుడు- వోరేయ్! నువ్వు మీసం వున్నావోడివైతే, నా ఎదురుంగా రా రా, రాముడెట్టాంటాడో నా చేత్తో చూపిస్తాను. పై శుక్రవారం పొద్దున ఈ పెట్టె తిరపతి నుంచొస్తుంది. అప్పుడు నిడదవోల్లో ఇదే లెట్రిన్ దగ్గర పెన్సిలు పట్టుకుని నుంచోనుంటాను. దమ్ముంటే కల్సుకోరా బచ్చా-అడివి పోటు రాముడు'

నేను అదిరిపోయాను! నేనూ హిందువునే. రాముడి మీద ద్వేషం లేదు. అంతేకాదు, శ్రీరాముడి కథ ఎంతోమందికి స్ఫూర్తినిచ్చినట్టు నాకూ ఇచ్చింది కూడా! నా జీవితంలో అనేక మలుపుల్లో 'ఇలా నడుచుకో సుఖపడతావు' అంటూ చెయ్యిపట్టి నన్ను నడిపించింది కూడా! 'రాముడు ఫూల్' అని నేను రాయటం కేవలం నోరు (చెయ్యి) జారి మాత్రమే! అసలా మాట అక్కడ సందర్భోచితం కాదు కూడా. ఎందుకు రాశానో తెలీదు. ఆ మాత్రానికే ఇంత రియాక్షనా! ఓరి దేవుడో! చటుక్కున ఆ రాతలన్నింటినీ చెరిపెయ్యబోయాను. ఆ బాల్ పెన్ను రాతలు ఒహ పట్టాన చెరిగితేనా! ఇంతలో కొంప మునిగిపోయినట్టు లెట్రిన్ తలుపు దబదబా చప్పుడైంది. తీసి చూద్దునుగదా, తలుపు పక్కనే నుంచొనున్న ఒకాడమనిషి తలుపు బాదుతోంది. తలుపు సందులో ఇరుక్కుపోయిన తన చీరె కొంగును బయటకు తీసుకోవటం కోసం ఆమె విశ్వప్రయత్నం చేస్తోంది.నేనామె చీరెకొంగు విడిపించే లోపలే నన్ను తోసుకుంటూ ఎవరో లెట్రిన్‌లో కెళ్లి తలుపేసేసుకున్నారు! అక్కణ్ణించి వరస వరసగా ఎవరో ఒకరు లోపలికెడుతూనే ఉన్నారు ఇంక మరినాకు లోపలికెళ్లే అవకాశమే లేకపోయింది. ఇంతలో రాజమండ్రి వచ్చేసింది. అట్లాగే నిరుత్సాహంగా దిగిపోయాను.

శుక్రవారం రానే వచ్చింది ఆ పూటే నా ప్రయాణమూ తప్పనిసరైంది. ఎప్పుడూ తాడేపల్లిగూడెంలో ఎక్కే వాణ్ణి, దురదృష్టమా అన్నట్టు ఆ పూట నిడదవోల్లో ఎక్కాల్సొచ్చింది. ఆ ఎక్కటం కూడా హడావిడిగా బండి బయల్దేరేటప్పుడే జరిగింది! పెట్టె కూడా అదే!! లెట్రిన్ దగ్గర ఇద్దరు కుర్రాళ్లు-పదిహేడు, పద్దెనిమిదేళ్ళ వాడొకడూ, అంతకన్నా చిన్నవాడొకడూ- పెన్సిళ్లు పట్టుకొని లెట్రిన్‌కు చెరొకవైపూనా వీరబాహువుల్లాగా నుంచొనున్నారు. నేను పెట్టెలోకెక్కగానే నన్ను నిశితంగా చూశారు. వాళ్లిద్దరూ కలిసి ఒకటైపోయారనీ, నా అంతు తేల్చటానికి అక్కడ కాచుకున్నారనీ నాకర్థమైపోయింది. ఏమీ ఎరగనట్టు నిర్లిప్తంగా నేను లోపలకెళ్లి సీట్లో కూర్చున్నాను. బండి బయల్దేరింది. చాగల్లు, పశివేదల దాటి కొవ్వూరు వస్తోందనగానే అలవాటు ప్రకారం నేను లెట్రిన్ కెళ్లాల్సొచ్చింది. అప్పటికి ఆపుకున్నా ఆ తర్వాతైనా తప్పదు. అప్పుడు నా 'కార్యక్రమం ఫలితం' తిన్నగా కిందికెళ్లి గోదావట్లో కలుస్తుంది.

నా చుట్టూ కూర్చునున్న ప్రయాణీకులు ఎంతోమంది - చదువుకున్నవాళ్లతో సహా-కింద గోదావరి కనిపించగానే డబ్బులూ పూలూ విసిరేసి లోకానికింత తిండి పెడుతున్న ఆ తల్లికి నమస్కారాలు పెడుతూండటం ప్రతిసారీ నేను చూస్తూనే ఉన్నాను. అట్లాంటి పవిత్రమూర్తిని నాకార్యక్రమం 'ఫలితం' తో అభిషేకించటమా! పోనీ అలా అని రాజమండ్రి వచ్చేదాకా ఆగుదామంటే అక్కడ స్టేషన్లో లెట్రిన్ బాగుచేస్తున్నారు. ఇంక ఆ తర్వాత ఎప్పుడో ఎప్పుడో! ఎంతసేపని ఉగ్గబట్టుకోవడం? కనక లేవక తప్పలేదు. అయిష్టంగానే లేచాను. కాలరూ పాంటూ సవరించుకొన్నాను. క్రాపు సరిచూసుకున్నాను. నాలోని లెన్షన్ బయటపడనీయకుండా ఇండియా ప్రెసిడెంటు పోజులో లెట్రిన్‌వైపు నడిచాను. అక్కడున్న రెండు జతల చూపుల బాణాలు నన్ను నిశితంగా గుచ్చుకుంటూండంగా తాపీగా(?) నేను లోపలికెళ్లి తలుపేసుకున్నాను. నా పని కానిచ్చుకొన్న తర్వాత తడి చిత్తుకాగితంలో ఆ రాతలన్నింటినీ చెరపటానికి ప్రయత్నించాను. ఎంత శ్రమ పడ్డానో ఆ పెరుమాళ్లకే ఎరుక! తలుపు తీసుకుని ఇవతలకొచ్చానో లేదో నన్ను తినేసేటట్టు చూస్తూ ఆ కుర్రాళ్లిద్దరూ నన్ను దూసుకుంటూ సర్రున లోపలికెళ్లిపోయారు. నేనివతలికి కంపార్ట్‌మెంట్‌లో కొస్తూంటే బయటి కొస్తూ వాళ్లు. "వీడే పాంచ్‌కి పాషా. పద పద ఆపాపు!" అనటం నా చెవిని పడింది. నాకు ఒళ్లు ఝల్లుమంది. వెన్నులోంచి హఠాత్తుగా ఒణుకు అందుకుంది. వాళ్లు నన్నేం చెయ్యబోతున్నారో నాకు తెలీదు. పెద్దగా ఏమీ చెయ్యకపోవచ్చు కూడా. కానీ నా చుట్టూ చేరి నా పేరెత్తకుండా నా అమ్మకీ నా అబ్బకీ శాపనార్థాలు పెడితేచాలదా! అశ్లీల పదాల్లో తిడితే చాలదా! పరువూ బాధ్యతా తెలీని కుర్ర వెధవల నోట్లో పడి పరువూ బాధ్యతా గల ఉద్యోగిని నేను ఖర్చయిపోవటమా! క్షణం ఆలస్యం చెయ్యకుండా ఎదురుగుండా కనిపించిన ఖాళీ అటక మీదికి ఒక్క ఎగురు ఎగిరాను. సర్రున చొక్కా విప్పేసి తలకింద పెట్టుకుని పడుకుని, రాని నిద్ర నటించాను.

'ఏడి, వాడేడి' అనుకుంటూ వాళ్లిద్దరూ రెండు మూడుసార్లు పెట్టంతా కలయతిరిగారు. 'అవతల పక్క లెట్రిన్‌లోకే దూరాడో లేక దూకేశాడో, పోనీ సన్నాసెదవని!' అనుకున్నారు. రాజమండ్రి వచ్చింది ఆ ఇద్దరూ దిగి పెట్టెలోకి చూసుకుంటూ వెళ్లిపోయారు. కాస్సేపటికి నేను అటక మీంచి దిగాను. రెండోవైపు నించి పెట్టె దిగాను. అవతలివైపు వెయిటింగు రూంలో అరగంట కూర్చుని సావకాశంగా బయల్దేరాను. ఆ మర్నాడే నాకు వెనక్కి ట్రాన్సఫర్ ఆర్డరొచ్చింది. కనక మరింక తిరుమల ఎక్కే అవసరం లేకపోయింది.

(స్వాతి సపరివార పత్రిక 14-12-1990)

★★★ ★★★ ★★★